ప్రజాశక్తి

శుక్రవారం 7 జూన్ 2024 5 శ్రీ సత్యసాయి

విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

అప్రజాస్వామిక నిర్ణయాలతోనే వైసిపి ఓటమి

◆ నియంతృత్వ పోకడలు ఎప్పటికీ నష్టమే

◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఐదేళ్ల పాటు వైసిపి ప్రభుత్వం అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుని ప్రజలు, కార్మిక, కర్షకులు, రైతులు, ఉద్యోగులను ఇబ్బందికి గురి చేయడం వల్లనే ఎన్నికల్లో ఓటమి పాలైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు నష్టం కలిగించే అనాలోచిత నిర్ణయాలు అనేకం తీసుకుందన్నారు. ఇసుక, మద్యం మాఫియా, కొండలు, గుట్టల భూముల అక్రమణలు, మంత్రులు ఎమ్మెల్యేలు మాటతీరు వంటి ఎన్నో ప్రజా వ్యతిరేక విధానాల వల్ల జగన్ ప్రభుత్వం ఎన్నికల్లో చతికిల పడిందన్నారు. ఏ ప్రభుత్వాలైన రైతులు, కార్మికులు, ఉద్యోగులను విస్మరించరాదన్నారు. అంగన్వాడీ, మున్సిపల్, కార్మికులు, ఆశాలు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి న్యాయమైన కోర్కెలు తీర్చాలని ఎన్నో సమయాల్లో వినతులు అందించారన్నారు. అయినా స్పందించకపోతే పోరాటాలకు దిగారన్నారు. ఇలాంటి సమయంలో వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరించిందన్నారు. జగన్ అధికారంలో ఉండగా లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులతో కన్నీళ్లు పెట్టించారని గుర్తు చేశారు. ఆ ప్రభావం ఎన్నికల్లో ఆయన్ను దెబ్బతీసిందని తెలియజేశారు. కరువు జిల్లా ఉమ్మడి అనంతపురంలో పండ్లతోట పెంపకంకు ఎంతో ఆసరగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్‌ను ఎత్తేసిన ప్రభుత్వం వైసిపి అన్నారు. నాడు నేడు కింద పాఠశాలలను బాగు చేసినా, తరగతుల విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఉనికినే ప్రశ్నార్థం చేశారన్నారు. గతంలో కూడా దేశంలో ఇందిరా గాంధీ, ఎన్టీఆర్, రాజశేఖర్‌రెడ్డి, జయలలిత, చంద్రబాబు నాయుడులు కార్మికులు రైతుల, పట్ల నిరంకుశంగా వ్యవహరించి వారి ఆగ్రహానికి గురయ్యారన్నారు. ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డికి అలానే జరిగిందన్నారు. ఇక కేంద్రంలో బిజెపి రామున్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల రాజకీయాలు చేసిందన్నారు. ఇంత చేసినా రాముని గుడి కట్టిన ఆమోధ్య నియోజకవర్గంలోనే బిజెపి ఓటమి పాలైందన్నారు. మతతత్వంతో ఓట్లు పొందాలని చూసిన మోడీకి ప్రజలు బుద్ధి చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం రాష్ట్ర విభజన విషయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం మాట్లాడి నెరవేర్చాలా చూడాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన అన్ని విధాలా సాయాన్ని పూర్తి స్థాయిలో సాధించుకోవాలని తెలిపారు. శ్రామిక మహిళా సంఘం నాయకురాలు దిల్షాద్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ విధానం రైతులకు తీవ్రంగా నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. అందుకే రైతులు వైసిపి ఓటు వేయలేదన్నారు. మద్యపాన నిషేధం అమల్లో జగన్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివద్ధి చేసి ఉంటే ఓటరు సమాధానం ఈ విధంగా ఉండేది కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, జల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, సిఐటిజిల్లా కార్యదర్శి రమేష్, లక్ష్మీనారాయణ, బాబావలి, జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్.నరసింహులు, సాంబశివ, పాల్గొన్నారు.



మంత్రులెవరు..?

◆ అమాత్య యోగంపై ఆశలు

◆ సీనియార్టీ, సామాజిక తరగతుల వారీగా అంచనాలు

◆ అధిష్టానం నుంచి ఇప్పటి వరకు అందని స్పష్టత

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎప్పుడూలేని విధంగా సైకిల్ క్లీన్‌స్వీప్ చేసింది. కూటమి తరుపున బిజెపి నుంచి ధర్మవరంలో సత్యకుమార్ గెలుపొందారు. తక్కిన 13 అసెంబ్లీ స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ నాయకులందరూ విజయం సాధించారు. రాష్ట్రంలోనూ కనీవిని ఎరుగని విధంగా కూటమి విజయం సాధించింది. అధికారపార్టీగానున్న వైసిపి రాష్ట్రంలో 11 స్థానాలకే పరిమితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి మంత్రివర్గంలో చోటు లభించనుందన్నది చర్చనీయాంశంగా ఉంది.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కూటమి తరుపున జిల్లాలో ధర్మవరం ఒక్క స్థానంలోనే బిజెపి అభ్యర్థి ఉన్నారు. తక్కిన అందరూ తెలుగుదేశం పార్టీ నుంచే ఉన్నారు. అందులో కొంత మంది సీనియర్లు ఉన్నారు. గతంలో మంత్రులుగా పనిచేసిన వారూ ఉన్నారు. కొత్తగా ఎన్నికైనా వారూ ఉన్నారు. వీరిలో చాలా మంది మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అనంతపురం జిల్లాలో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలవ శ్రీనివాసులు బిసి సామాజిక తరగతి నుంచి ఉన్నారు. ఆయన 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన కూడా మరోమారు మంత్రివర్గంలో స్థానం కోసం ఆశిస్తున్న వారిలోనున్నారు. మంత్రి పదవి ఆశిస్తున్న వారిలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేరు కూడా ప్రముఖంగానే విన్పిస్తోంది. 2014లో ఆయన ఉరవకొండలో ఓటమి చెందడంతో మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ఆ తరువాత ఎమ్మెల్సీ ఇచ్చినా మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఈసారి తప్పకుండా ఆయనకు అవకాశం లభిస్తుందనే ప్రచారం సాగుతోంది. సామాజిక సమీకరణల్లో ఆయనకు స్థానం లభిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. గుంతకల్లు నుంచి గెలుపొందిన గుమ్మనూరు జయరాం వైసిపి ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేశారు. ఎన్నికల ముందు ఆయన ఆ పార్టీతో విభేదించి తెలుగుదేశం పార్టీలో చేరారు. గుంతకల్లు నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా ఆయన గెలుపొందారు. ఆయన కూడా సామాజిక సమీకరణల్లో భాగంగా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

సత్యసాయి జిల్లాలో రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పరిటాల సునీత 2014 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మొదట పౌర సరపరాల మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత ఆమెను స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మార్చారు. ఈసారి రాప్తాడు నుంచి ఆమె గెలుపొందారు. మంత్రివర్గంలో స్థానం ఆసిస్తున్న వారిలో ఆమె కూడా ఉంన్నారు. కూటమి తరుపున జిల్లా నుంచి పోటీ చేసి గెలుపొందిన ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. బిసి సామాజిక తరగతికి చెంది ఆయన కూడా మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశముందని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇలా ప్రధానమైన పేర్లు పెద్దఎత్తున ప్రచారంలోనున్నాయి. ఇందులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టన్ను చంద్రబాబునాయుడు ఎవరికి అవకాశం కల్పిస్తారన్న దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది. మంత్రులుగా ఎవరిని తీసుకోవాలనే దానిపై చంద్రబాబు మదిలో ఎవరున్నాన్నది ఇప్పటికీ వరకు బయటకు రాలేదు. ఆశావహులు మాత్రం రాష్ట్ర రాజధానికి చేరుకుని వారి ప్రయత్నాలు చేసుకునే పనిలోనున్నారు. కూటమిలో ఇతర పార్టీల సర్దుబాట్లతోపాటు ఇక్కడ ఎవరికి స్థానం కల్పిస్తారన్నది చూడాల్సి ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

జిల్లాలో 539.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు 539.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ మేరకు రెవెన్యూ గణాంకాల అధికారి గంగాధర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో అధికంగానూ మరికొన్ని మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసిందన్నారు. జిల్లాలో 5 మండలాలు మినహా 28 మండలాల్లో వర్షపాతం నమోదైందన్నారు. అత్యధికంగా బత్తలపల్లి మండలంలో 63.4 మిల్లీమీటర్లు, మడకశిరలో అత్యల్పంగా 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్ని మండలాల్లో రైతులు పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు.

బత్తలపల్లిలో 63.4 మిల్లీమీటర్లు

బత్తలపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బత్తలపల్లితో పాటు చుట్టుప్రక్కల గ్రామాల్లోనూ 63.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎఎస్‌ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ గురువారం తెలిపారు. ఈ వర్షం వల్ల కొన్ని గ్రామాల్లో చిన్నచిన్న కుంటల్లో నీరు చేరింది. అదేవిధంగా ఆర్జీటి ఆసుపత్రి ప్రాంగణం లోని చెక్‌డ్యాం నిండి పొంగిపొర్లింది. చాలా రోజుల తర్వాత మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో రైతులలో ఉత్సాహం ఉరకలేస్తోంది. తమ పొలాలను దుక్కులు చేసేందుకు వ్యవసాయ పరికరాలను సిద్ధం. చేసుకుంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సబ్సీడీ విత్తన వేరుశనగ కాయలను తీసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విత్తన కాయలను తీసుకునేందుకు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లితే సర్వర్లు పని చేయడం లేదని రైతులు వాపోతున్నారు.

ఆర్టీసీ కార్మికుల సేవలు అమోఘం : ఈడీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల సేవలు అమోఘమని ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈడీ గురువారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించి అధిక ఆదాయం, కేఎంపీలు సాధించిన డ్రైవర్లు, కండక్టర్లకు ఉత్తమ సేవా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సు సర్వీసుల ప్రయాణాలకు సంబంధించిన డ్రైవర్, కండక్టర్ నారాయణ, అనుష, బిఎంకె సాబ్‌లను ప్రశంసించారు. అలాగే మెయింటెనెన్స్ విధానంలో ప్రతిభ కనబరిచిన శేఖర్, ప్రతాప్‌లకు కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈడీ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ కన్నతల్లి లాంటిదని కొనియాడారు. సంస్థ అభివృద్ధి బాటలో నడిస్తేనే మన కుటుంబాలు సైతం అభివృద్ధి చెందుతాయని గుర్తు చేశారు. ప్రతి కార్మికుడు ప్రయాణికుల సౌకర్యార్థం సమయపాలన పాటిస్తూ ఆర్టీసీ సర్వీసులను నడపాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయివేట్ పశువులకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సులోనే సురక్ష ప్రయాణం లభిస్తుందనే విషయాలను ప్రయాణికులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుమంత్, ఆదోని రమేష్‌బాబు, సిపిఎం రామచంద్ర, డిపో మేనేజర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

మా దగ్గరే కొనాలి..!

◆ పుస్తకాల విక్రయాలపై ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల హుకుం

◆ యూనిఫాం, బెల్ట్, బ్యాడ్జీలపైనా ఆదేశాలు

◆ అడ్డంగా దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ

ప్రజాశక్తి-హిందూపురం

'విద్యార్థులకు అవసరమైన పుస్తకాల నుంచి సాక్సుల వరకు ఏది కావాలన్నా మా దగ్గరే కొనాలి...!' అంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు హుకుం జారీ చేస్తు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డంగా దోచుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఓ ప్రయివేటు పాఠశాలలో స్టేషనరీ ధరలు ఇలా ఉన్నాయి. యూనిఫాం (ఒక జత) రూ.1500 నుంచి రూ. 3000, బెల్ రూ.150 నుంచి 200, టై రూ.100, బ్యాగు రూ.700 నుంచి రూ. 1000, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ రూ.3000 నుంచి రూ.5000 వరకు విక్రయిస్తున్నారు. ఇవి చాలదన్నట్లు వర్క్ బుక్ ల పేరుతో రూ.3వేల నుంచి 5వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతిది ఇక్కడే కొనాలన్న నిబంధనలు విధించి చదువును కిరాణ దుకాణంలోని సరుకుల్లా విక్రయిస్తున్నారు. ఈ విషయాలు విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికి కనీస చర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఇఒకార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. ఇక నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు గంపగుత్తగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విద్యార్థుల తల్లిదండ్రులను నగదు వసూలు చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు ధరలను వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరుమెదపకపోవడంలో ఆంతర్యమేంటని విద్యార్థి సంఘాల నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూలను తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తుండటం గమనార్హం. తమ పిల్లల భవిష్యత్ బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక కార్పొరేట్ పాఠశాలలకు కల్పతరువుగా మారుతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలాది రూపాయల ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూఅంటూ అందినకాడికి అందినంత దోచుకుంటున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 1616 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 452 వరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మిగిలినవన్నీ ప్రైవేటు యాజమాన్యాల అధీనంలో ఉన్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. పలు పాఠశాలల్లో మౌలిక వసతుల లేవు, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాల కొరత, తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరీ వసూలు చేస్తున్నాయి. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి రూ. 700ల వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా.. గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్ని కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలు పుస్తకాల ఖర్చు సరిపోతుంది. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కేజీ, యుకేజీ తరగతులకే రూ.3 వేలు వసూలు చేస్తుండగా, పెద్ద తరగతులకు రూ.8 వేలు నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. దీంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహకులు దోపిడిని మరింత పెంచారు.

క్షయ నివారణకు కృషి చేయండి

డిఎంహెచ్‌ఓ మంజువాణి

ప్రజాశక్తి-మడకశిర

క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిఎస్.మంజువాణి సూచించారు. మండల పరిధిలోని కదిరేపల్లిలో చేపట్టిన అడల్ట్ బిసిజి వాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం డిఎంహెచ్‌ఒ సందర్శించి రికార్డులు, వాక్సినేషన్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతను వివరించారు. కదిరేపల్లిలో ఇంతకు ముందు జరిగిన అడల్ట్ పీసీసీ సెక్షన్స్ ఎవరైతే బెనిఫిట్స్ వ్యాక్సిన్ తీసుకొన్నారో వారి ఇంటి వద్దకు వెళ్లి స్కార్‌ని చెక్ చేశారు. అడల్ట్ బిసిజి లక్ష్యాలను చేరుకోవాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ తీసుకొని క్షయ వ్యాధిని నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో కదిరేపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎన్ఎం సుమిత్ర, టిబి యూనిట్ సూపర్వైజర్ రాము, తదితరులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డిఎం అండ్ హెచ్ ఓ మంజువాణి

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కంచిసముద్రం సెక్టార్ పరిధిలోని కొండూరు గ్రామంలో గురువారం 7 నెలలు నిండిన పిల్లలకు తల్లి పాలతో పాటు అనుబంధహారం మొదలు పెట్టే కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 7 నెలల నుంచి మూడేళ్ల పిల్లలు కలిగిన తల్లులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ రెడ్డిరమణమ్మ హాజరై మాట్లాడారు. పిల్లలు అన్ని రకాలుగా పురోగతి సాధించాలంటే పౌష్టికాహారం అందించాలన్నారు. తద్వారా పిల్లలోల శారీరక, మానసిక, సాంఘిక ఎదుగుదల బాగుంటుందని తల్లులకు తెలిపారు. సరైన బరువు ఉన్న పిల్లలకు, ఆరోగ్యవంతమైన బేబీ పిల్లల తల్లులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో బహుమ తులు అందజేశారు. అనంతరం పౌష్టికాహారం, వంటల ప్రదర్శన ఏర్పాటు చేసి తల్లులకు తక్కువ ఖర్చు తో ఎక్కువ పోషక విలువల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల అంగన్వాడీ పర్యవేక్షకులు జయమ్మ, శ్రీలక్ష్మి, మంజుల, వరుణ్, కార్యకర్తలు 25 మంది పాల్గొన్నారు.

చిన్నపిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ రెడ్డిరమణమ్మ

ప్రజాప్రతినిధులకు 'ఈ-పోస్ట్‌తో శుభాకాంక్షలు'

పోస్టల్ శాఖ వినూత్న కార్యక్రమం

ప్రజాశక్తి-అనంతపురం

2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈపోస్ట్ సందేశాల ద్వారా 2024లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపే అవకాశాన్ని కల్పించింది. విజయం సాధించిన ప్రతి ప్రజా ప్రతినిధికి ఈ పోస్టు సందేశాల ద్వారా శుభాకాంక్షలు తెలియజేయవచ్చు. కేవలం రూ.10 చెల్లించి ఈ పోస్టు ద్వారా వారికి నచ్చిన ప్రజాప్రతినిధికి శుభాకాంక్షలు తెలియజేవచ్చు. పోస్టుఫీసు ద్వారా ఇలా పంపించిన సందేశాలు నేరుగా వారికి నాయకుని చేతికే చేరుతాయి. ఈపోస్ట్ ద్వారా రాష్ట్రంలోని 1.55 లక్షల పోస్ట్ ఆఫీస్‌ల నెట్‌వర్క్, ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్, ఫిజికల్ డెలివరీ కలయికతో భారతదేశంలోని ఏ చిరునామాకైనా సందేశాలను పంపే అవకాశం ఉంటుంది. ఇంటర్నెట్ ద్వారా సందేశాలను సాఫ్ట్ కాపీగా పంపుతుంది. గమ్యస్థానంలో అది హార్డ్ కాపీ రూపంలో చిరునామాదారునికి చేరుతుంది. కేవలం పది రూపాయల ఖర్చుతో ఈ సందేశాన్ని పంపే అవకాశాన్ని పోస్టల్ శాఖ అందుబాటులోకి తెచ్చిందని ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు తెలియజేశారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకుడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కంబాలపల్లి పంచాయతీలోని బీదనపల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు గోపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కంబాల పల్లి పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాటర్ ప్లాంట్‌ను తమకు అప్పగించాలని మూడు రోజుల క్రితం కంబాలపల్లి టిడిపి సర్పంచి మంజు పంచాయతీ కార్యదర్శిని కోరారు. అయితే నిర్వాహకుడు వాటర్ ప్లాంట్‌ను అప్పజెప్పకపోగా మూడు రోజుల నుంచి గ్రామంలో తాగునీటి సరఫరా చేయడం లేదన్నారు. దీంతో అతడిపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటర్ ప్లాంట్‌ను అప్పగించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఎస్ఐ వలిబాషాను కోరారు.

గ్రామాల్లో ఘర్షణలు..

పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలోని తుంగోడు, పత్తికుంటపల్లి, రంగేపల్లి, సోమందేపల్లి, తదితర గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దీంతో ఘర్షణకు కారకులైన ఇరు పార్టీల వ్యక్తులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. కొందరు వ్యక్తుల స్వార్థానికి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయాలు శాశ్వతం కాదని, పెద్ద పెద్ద నాయకులే ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి, ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి మారుతున్న రోజుల్లో గ్రామాల్లో ప్రజలు అనవసరంగా ఘర్షణలకు దిగవద్దని సూచించారు. ఘర్షణల వల్ల మీ కుటుంబాలు, పిల్లలు రోడ్డున పడతారని తెలిపారు. కావున గ్రామాల్లో ప్రజలు ఘర్షణలు, అల్లర్లకు దూరంగా ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇరు పార్టీల వ్యక్తులు

సోమందేపల్లి పోలీస్‌స్టేషన్

కూలిన వందేళ్ల జీయ చెట్టు

నేలకొరిగిన వందేళ్ల వృక్షం

పుట్లూరు : మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉన్న వందేళ్లు పైబడిన జీయ చెట్టు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగింది. ఎందరికో నీడనిచ్చిన చెట్టు కూలిపోవడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే చెట్టు కింద పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. దీంతో స్థానికులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పచ్చదనాన్ని కాపాడాలి

పెద్దపప్పూరు : వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పచ్చదనాన్ని పరిరక్షించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మండలం పరిధిలోని చిన్నపప్పూరు, జూటూరు గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో విత్తనాలతో కూడా బాళ్లను తయారు చేసి ఖాళీ ప్రదేశాల్లో వెదజలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు పెరిగి పెద్దవైతే మానవాళికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

పుట్లూరు : పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మండల కేంద్రంలోని బొంత ప్రణతికి భూమిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు రూ.10వేల చెక్కును విద్యార్థిని తల్లికి ట్రస్టు సభ్యులు బి.రాజమ్మ, రామంజులరెడ్డి అందించారు. ఆర్థికసాయం అందించినందుకు భూమిరెడ్డి ట్రస్టుకు ప్రణిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన పయ్యావుల, కాలవ

కలెక్టరేట్ : విజయవాడలో నివాసంలో టిడిపి అధినేత చంద్రబాబును జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి కాబోతున్నందుకు చంద్రబాబుకు బొకేలు అందజేసి ఇందులో భాగంగా శుభాకాంక్షలు తెలిపారు. కాగా టిడిపి మంత్రివర్గం ఆశావాహుల్లో వీరిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది.

సబ్సిడీ విత్తనం దళారుల పాలు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ దళారుల పాలైందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. కొందరు దళారులు ఆయా సచివాలయాలకు రైతు పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని వచ్చి విత్తన వేరుశనగ తీసుకుని బ్లాక్‌మార్కెట్‌కు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. విత్తనం కావాల్సిన రైతులు వేరుశనగ కోసం వెళితే అప్పటికే సచివాలయాలకు కేటాంచిన స్టాక్ అయిపోయిందని అధికారులు చెబుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సబ్సిడీ విత్తన కాయలు పది నుంచి ఇరవై రోజుల వరకు పంపిణీ చేసేవారని ఇప్పుడు త్వరగానే స్టాక్ అయిపోయాయని చెబుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి అర్హులైన రైతులకు సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

ఆలయ ద్వారం పునర్‌నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

దుండగుల దాడిలో ధ్వంసమైన గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామ సమీపాన ఉన్న ఖబ్బం నరసింహస్వామి ఆలయ ద్వారం పునర్‌నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. దాదాపు నెలక్రితం దుండగుల చేతిలో ధ్వంసమైన ఆలయ ద్వారాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ధ్వజస్తంభం ఎదురుగా ఉన్నటువంటి ద్వారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పురాతన ధ్వజస్తంభం, ద్వారాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు డిఎల్ నరసింహ రావు, కటారుపల్లి వేణుగోపాల్ రెడ్డి, దోనికొండ ఆనంద్, నంద వేమారెడ్డి, చిన్న ఓబులరెడ్డి, దూర్జటి పవన్ కుమార్, సుధాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి,శ్రీనివాసులు రెడ్డి, గంగయ్య యాదవ్,మధుసూదన్ రెడ్డి, వెంకటేశ్వర్లు,కదిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం వద్ద శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న ఈవో, తదితరులు

CHANGE OF NAME

I, **RATHNASREE BANDLAPALLI** (Old Name) D/O. **RAMACHANDRA** Bandlapalli, H.No. 1-182 Main Bazar, Amarapuramu-515 281, Sri Sathya Sai District, Andhra Pradesh. Changing My Name from **RATHNASREE,** Bandlapapalli (Old Name) To Bandlapalli **RAMACHANDRA RATHNASREE** (New Name) Hence forth I am being called as Bandlapalli Ramachandra Rathasree for all purposes.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాగ్యరేఖ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బాల్యవివాహాలను నిర్మూలించడానికి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. ఈ మేరకు ఆమె పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో గురువారం మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజనల్ స్థాయి , గ్రామస్థాయి, అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు లక్ష్మీ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో భాగ్య రేఖ, విశిష్ట అతిథిగా పుట్టపర్తి డిఎస్పి వాసుదేవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో భాగ్యరేఖ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం డివిజనల్ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు బాల్య వివాహాల నిరోధకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 13 ప్రకారం అధికారులను నియమించిందన్నారు. ప్రతి ఒక్క గ్రామంలో కౌమార దశకు వచ్చిన బాలికలందరినీ గ్రామస్థాయి బాల్య వివాహ నిరోధక అధికారులు ఒక్కరైనా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వారికి తెలియజెప్పాలన్నారు. ఒక బాలిక చదువు ఆ ఇంటికి వెలుగును నింపుతుందని చెప్పారు. డిఎస్పి వాసుదేవన్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నాయన్న సమాచారాన్ని మండల స్థాయిలో పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారం పోలీస్ అధికారులకు తెలిపితే గ్రామస్థాయిలోకొచ్చి వారి తల్లిదండ్రులకు అందరి అధికారుల సమన్వయంతో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు లక్ష్మికుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నాయని సమాచారం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 181 కు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖతో పాటు రెవెన్యూ, పోలీస్ పంచాయతీరాజ్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల్యవివాహాలను నిరోధించాలని తెలియజేశారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆంధ్రప్రదేశ్ బాల్య వివాహాల నియమ నిబంధనల పైన డిసిపిఒ మహేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. బాలల పైన లైంగిక దాడులు గురించి పిపిటి రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, మండల డెవలప్మెంట్ ఆఫీసర్లు, పుట్టపర్తి సిడిపిఒ గాయత్రి, సోమందేపల్లి సిడిపిఒ అనురాధ, ఓడి చెరువు సిడిపిఒ వరలక్ష్మి , జిల్లా బాలల సమితి పరిరక్షణ అధికారులు నాగలక్ష్మి మురళీ , ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అభివృద్ధికి కలిసి పనిచేద్దాం : ఎమ్మెల్యే కందికుంట

కూటమి నాయకలతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కూటమి పార్టీల సహకారంతో అందరూ కలసి కదిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్. పార్థసారథి పేర్కొన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి నివాసంలో కూటమి నాయకులను ఎమ్మెల్యే కందికుంట కలిశారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమిష్టి కృషితోనే రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టిందన్నారు. ప్రజలకు అవసరమైన పరిశ్రమలు, కళాశాలలు టెక్నికల్ కళాశాలలు వచ్చేందుకు కృషి చేద్దామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మిట్ట వంశీకృష్ణ, గంగాధర్, జెట్టి ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మేరకే భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా స్థల యజమానులు తమ భవనాలను నిర్మాణం చేయాలంటే తప్పని సరిగా పురపాలక శాఖ అనుమతులు తీసుకోవాలని, తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని విడి రోడ్డులో నిర్మాణం చేసిన భవనాలను, వాటికి పురపాలక సంఘం వారు ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎవరైన ఆక్రమణలకు పాల్పడి ఉంటే వెంటనే తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎసిపి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విడి రోడ్డులో భవనాలను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసం వద్ద సంబరాలు కొనసాగుతూనేఉన్నాయి. టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు కందికుంటకు అభినందనలు తెలుపుతున్నారు. 20 సంవత్సరాల రాజకీయ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన ఎదురుకుంటున్న ఒడుదుడుకులను ఆయన అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. మరోవైపు కొంతమంది ప్రభుత్వ అధికారులు కూడా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు చెబుతున్నారు.



ప్రతిభా విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఇఒ, తదితరులు

ప్రతిభా విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారి మూడే బొజ్జే నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ రమణప్ప నీట్, జేఈఈ ప్రతిభ విద్యార్థులను సన్మానించారు ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ , ఈశ్వరప్ప, మురళి నాయక్ ,వెంకటేష్ నాయక్ ,బాబు నాయక్ , విశ్వనాథ్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నీట్ లో 656/700 మార్కులు సాధించిన స్థానిక విద్యార్థి గణేష్ నాయక్‌ను జేఈఈ మెయిన్స్ నందు దేశ వ్యాప్త 2821 ర్యాంకు సాధించిన జ్యోతి ప్రసాద్ నాయక్‌ను సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు పఠనాశక్తిని పెంచుకోవాలని, విద్యార్థులు గ్రంథాలయాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఖాదర్ భాషా పాముదుర్తి గ్రంథాలయ అధికారి ప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అర్థవంతమైన విద్యాబోధన అవసరం

సమావేశ:లో మాట్లాడుతున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు అర్థవంతంగా విద్యాబోధన చేయాలని ఆర్‌జెడి రాఘవరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో గురువారం జిల్లాలోని విషయ నిపుణులకు రెండు రోజుల జ్ఞాన ప్రకాష్ రిఫ్రెష్‌మెంట్ కోర్సును ప్రారంభించారు. ఈ కోర్సులో ఒకటి రెండు తరగతుల పిల్లలకు అర్థవంతంగా బోధించడానికి బోధన పరికరాలను ఎలా ఎలా ఉపయోగించాన్న దానిపై శిక్షణ ఇచ్చారు. గణితం, ఆంగ్లం సులభతరం చేయడం ఎలా అనే అంశాలపై చర్చలు నిర్వహించి నూతన మూల్యాంకన విధానాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్‌జెడి రాఘవరెడ్డి శిక్షణ తరగతుల గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, డైట్ ప్రిన్సిపల్ రవి సాగర్, ఎఎంఒ మహేందర్ రెడ్డి, ఎంఇఒ గోపాల్ నాయక్, ప్రథమ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నీట్‌లో పుట్టపర్తి విద్యార్థికి ఆల్ ఇండియా ర్యాంక్

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణానికి చెందిన కత్తి భాస్కర్ రెడ్డి కుమారుడు కత్తి లికేష్ రెడ్డి నీట్‌లో ఆల్ ఇండియా 352 ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి కత్తి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడు ఆల్ ఇండియా నీట్ లో 352 ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన కుమారుడు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పుట్టపర్తి లోని సత్యసాయి విద్యా సంస్థ ప్రైమరీ స్కూల్ లో చదివాడని ఆ తరువాత ఇంటర్మీడియట్ హైదరాబాదులోని శ్రీ చైతన్యలో చదివాడన్నారు.

విత్తన వేరుశనగను పరిశీలించిన సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్లో వేరుశన సాగు చేసే రైతాంగానికి రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగను మండల సిపిఐ నాయకులు పరిశీలించారు.గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లి లోని ఆర్‌బికెలోరిజిస్ట్రేషన్ చేసుకున్న రైతాంగానికి పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగను సిపిఐ మండల కార్యదర్శి మండల వెంకటేష్, పలువురు సిపిఐ నాయకులతో కలిసి పరిశీలించారు. విత్తన వేరుశనగ నాణ్యతను రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనంతో పాటు ఎరువులు కూడా సబ్సిడీపై పంపిణీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, రామకృష్ణ, సత్యప్ప, నాగభూషణ, నారాయణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్లిన పుట్టపర్తి ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శాసన సభ్యురాలుగా ఎన్నికైన పల్లె సింధూర రెడ్డి గురువారం విజయవాడకు తరలి వెళ్లారు. అధిష్టానం పిలుపుమేరకు ఆమెతోపాటు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డి, యువ నాయకుడు పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి విజయవాడలోని టిడిపి కార్యాలయానికి తరలి వెళ్లారు. చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలపడంతో పాటు తన గెలుపుకు దోహదపడిన టిడిపి నాయకులు కార్యకర్తల కృషి గురించి అధినేతకు వివరించనున్నారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేస్తూ తాము అందుబాటులో ఉండమని ప్రజలు ఎవరు కార్యాలయానికి గాని, అనంతపురంలో తన నివాసానికి గాని రావద్దని ఎమ్మెల్యే తెలిపారు.

అగ్రిబోర్డ్ జిల్లా చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ అవుటాల రమణారెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలలో వైసిపి ఓటమి చెందినందున నైతిక విలువలతో ఆ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అభినందిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి నుండి వేల్పుమడుగు వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో తండ్రి, తనయునికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం అనంతపురానికి చెందిన చింతకాయల నాగేంద్ర వేల్పుమడుగు చెందిన వృద్ధుడు నల్లప్పను తన ఆటోలో తీసుకుని వెళుతున్నారు. అదే సమయంలో గంటాపురం నుండి బత్తలపల్లికి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలోని జాంపుల జయసింహ, ఐదు సంవత్సరాల మోక్షిత్‌తో పాటు ఆటో డ్రైవర్ నాగేంద్ర, వేల్పుమడుగుకు చెందన వృద్ధుడు నల్లప్ప గాయపడ్డారు. వీరందరిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో జాంపుల జయసింహ, మోక్షిత్ (తండ్రి కొడుకు)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండగా అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి సూచించారు. గురువారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నముష్టూరు, రాకెట్ల, రాకెట్ల తండా, షేక్షానిపల్లి, షేక్షానిపల్లి తండా, రాచర్ల తండా గ్రామాల్లో మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాఫిలాస్ అనే ఆడదోమ కాటు వల్ల మలేరియా వ్యాధి వస్తుందన్నారు. ఈ దోమలు ఎక్కువగా నీటిలో గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కావున ఇంట్లోగానీ, పరిసరాల్లోగానీ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. మలేరియా జ్వరం వచ్చిన వారికి మొదట చలి వేసి, జ్వరం వచ్చి తర్వాత చెమటలు పట్టి జ్వరం విడిచి పెడుతుందన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే మలేరియా భావించి వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, హేమలత, సిఒ భగవాన్‌దాస్, నాగరాజు, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు అభినందనలు

అనంతపురం కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌కి పలువురు టిడిపి నాయకులు గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, దేవళ్ల మురళి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు అనంతపురంలోని ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అభినందనలు తెలిపిన వారిలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్, టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు గోగుల నాగభూషణ, పెద్ద నాగమణి, కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి : ఆర్‌పిఎస్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో గెలుపొందిన ఎన్‌డిఎ కూటమి నాయకులు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే బాధ్యతను తీసుకోవాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కేంద్రంలో టిడిపి మద్దతు అవసరం కాబట్టి రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను పూర్తిస్థాయిలో సాధించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడానికి ఉద్యోగుల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. ఇప్పుడు కేంద్రం చేతిలో ఉన్న సిపిఎస్ రద్దు అంశంపై స్పష్టమైన హామీతో మద్దతు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో పెండ్డింగ్ ప్రాజెక్టులు, వ్యవసాయ రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలు ఏర్పాటు, రైల్వేజోన్, విశాఖ ఉక్కు పరిశ్రమ పురోగతి కోసం చంద్రబాబు, పవన్ కృషి చేయాలన్నారు.

నెరవేరిన నాలుగు దశాబ్దాల కల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తమ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కావాలన్న తమ తాత నాలుగు శతాబ్దాల కల నేటితో నెరవేరిందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి బుక్కరాయసముద్రం మండలం సిద్ధలాపురం గ్రామంలో ఉన్న శ్రావణిశ్రీ తాత బండారు నారాయణస్వామి సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి సాధించిన ఇంత ఘన విజయంలో తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. సాధారణ ఎన్నికలో తన గెలుపు కోసం అహర్నిశలు పని చేసిన నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు, బిజెపి, జనసేన నాయకులలు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు.

బండారు నారాయణస్వామి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

'ఆలం'కు టిడిపి నేతల అభినందనలు

నార్పల : ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడును పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి పార్టీ అధికారంలోకి వచ్చినందుకు అభినందనలు తెలిపారు.

కలగా మారిన మినీ స్టేడియం

పజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఎంజిఎం మైదానంలో 2018లో ప్రారంభమైన మినీ స్టేడియం నిర్మాణం క్రీడా కారులకు కల గా మిగిలింది. త్వరలో పూర్తవుతుంది.. సాధన చేసేందుకు సౌకర్యంగా ఉంటుందనుకున్న సమయంలో.. అందరినీ నిరుత్సాహ పరిచింది. సంబంధిత కాంట్రాక్టరుకు బిల్లులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ఎంతో అవసరం. ఎప్పుడూ విద్య పైనే దృష్టి పెడితే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారనే ఉద్దేశ్యంతో పాఠశాలలు, కళాశాలల్లో క్రీడలను ఒక భాగం చేశారు. తద్వారా క్రీడల్లో పిల్లలు పట్టు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు. విద్యార్థులనే కాక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అక్కడక్కడా మినీ స్టేడియాలను నిర్మించింది. ఈ క్రమంలో హిందూపురం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల క్రీడా మైదానంలో మినీ స్టేడియాన్ని నిర్మించేందుకు క్రీడా వికాస్ కేంద్రం (కేవీఆర్) ఆధ్వర్యంలో 2018లో రూ.2కోట్లతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేశారు. ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతను సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అప్పగించారు. గుత్తేదారులు కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. దీంతో పట్టణవాసులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. అంతా సవ్యంగా జరుగుతున్న సమయంలో బిల్లులు రాకపోవడం కారణంతో కాంట్రాక్టర్ పనులను ఎక్కడికక్కడ ఆపేశాడు. దీంతో ఎంజిఎం మైదానంలో అసంపూర్తిగా ఉన్న మినీస్టేడియం దిష్టి బొమ్మలా దర్శనమిస్తోంది. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయిలో ఆడుతున్న ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడల్లో నైపుణ్యం గల క్రీడాకారులున్నారు. వారు సాధన చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. స్టేడియం పూర్తయి ఉంటే ఉదయం, సాయంత్రం సాధన చేసుకుంటూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు అవకాశం ఉండేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నూతన పాలకులు స్పందించి నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.